క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లాలమ్మగార్డన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో కేబుల్‌ను మారుస్తున్నందున శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు భాగ్యలక్ష్మి కాలనీ, లాలమ్మగార్డన్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులకు జరిమానా

శంషాబాద్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 21 మందిని ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీసులు గురువారం మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపర్చారు. ఇందులో ఆరుగురికి రెండు రోజుల నుంచి మూడురోజుల జైలు శిక్ష విధించారు. మిగతావారికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

పార్కు స్థలంలో నిర్మాణాల కూల్చివేత



ప్రహరీని కూల్చి వేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: బుద్వేల్ జనచైతన్య వెంచర్‌లోని పార్కు స్థలంలో చేపట్టిన నిర్మాణాలను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందికూల్చి వేశారు. దాదాపు ఐదు వేల గజాల స్థలంలో ఐదు ప్రహరీ గోడలను నిర్మించారు. ఈ విషయమై స్థానికులతో పాటు సాక్షిలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు నిర్వాహకులకు నోటీసులు అందించారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో టౌన్‌ప్లానింగ్ అధికారి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం కూల్చివేతలు నిర్వహించారు. ఈ స్థలం చుట్టు ప్రహరీని నిర్మించేందుకు జీహెచ్ఎంసీ ఉప కమిషనర్‌కు లేఖ రాశారు.

తృణ ధాన్యాల ఆవశ్యకతపై నేడు ర్యాలీ

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నేడు తృణ ధ్యానాల ప్రాముఖ్యత మరియు సేద్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు.2023ను అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా గుర్తించడం జరిగిందని, తృణధాన్యాల సాగును ప్రోత్సహించడంతో బాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులను సాగుకు సన్నద్ధం చేసేందుకు ఈ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ ర్యాలీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరవుతారని వీరితో పాటు భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.

5న 'సీఓఈ' అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) ఇంటర్మీడియట్ అర్హత పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సీఓఈ–2023 పరీక్ష జరుగుతుందని అభ్యర్థులు సకాలంలో హాజరవాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే రావాలని ఆమె సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, పరీక్ష ప్యాడ్ తీసుకురావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం

రాయదుర్గం: ఆసియాలో టాప్–20 ఆర్ట్స్ అండ్ హ్యుమనిటీస్ పరిశోధకుల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ ఫ్యాకల్టీ ప్రతినిధులకు అవకాశం దక్కింది. వరుసగా నాలుగో సంవత్సరం విడుదల చేసిన సెంటర్ ఫర్ పబ్లికేషన్స్ ఎథిక్స్, సావిత్రిబాయి పూలే పూణే విశ్వవిద్యాలయ నివేదిక 'భారతదేశం, దక్షిణాసియా, తూర్పు ఆసియాలో కళలు, హ్యుమనిటీస్ పరిశోధనలో ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు నారాయణచంద్రన్, ప్రమోద్.కె.నాయర్‌లకు అవకాశం లభించింది. ప్రొఫెసర్లకు గుర్తింపు రావడం ఆనందకరమని హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు.



ప్రొ.నారాయణ చంద్రన్



ప్రొ.ప్రమోద్ కే నాయర్

ప్రకాశ్‌గౌడ్‌కు లైన్ క్లియరేనా?

- మిర్జా రహమత్ బేగ్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవం
- బీఆర్ఎస్, ఎంఐఎం నడుమ అవగాహన ఉంటుందా?



రాజేంద్రనగర్ సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్



రాజేంద్రనగర్ నియోజకవర్గ మ్యాప్

మణికొండ: ''కారు స్టీరింగ్ (బీఆర్ఎస్) మా చేతుల్లోనే ఉంది... రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 50 స్థానాలలో పోటీకి దిగుతున్నాం'' అంటూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల ఓ ప్రకటన చేశారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపునకు అవసరమైన మెజారిటీ బీఆర్ఎస్‌కు ఉన్నా, పొత్తులో భాగంగా ఆ స్థానాన్ని ఎంఐఎంకు వదిలేసింది. ఆ స్థానంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ సెగ్మెంట్ నుంచి ఎంఐఎం తరఫున పోటీ చేసిన మిర్జా రహమత్ బేగ్‌ను బరిలో దింపింది. పోటీలో ఎవరూ లేకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలోనే వచ్చే ఎన్నికల్లో రాజకీయ సమీకరణలు ఎలా ఉంటాయోనంటూ స్థానికంగా చర్చ సాగుతోంది. రాజేంద్రనగర్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కులైన్ క్లియర్ చేయడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరి నిలవలేదనే ప్రచారం సాగుతోంది.

- గత ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ నుంచి గెలుపొందగా, ఎంఐఎం రెండవ స్థానంలో నిలిచిన కాంగ్రెస్ పార్టీకి మూడు వేల ఓట్ల తేడాతోనే మూడవ స్థానానికి పరిమితమైంది.
- గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బలం అంతంతే కాగా, జీహెచ్ఎంసీ ఎన్నికల నాటి బలం పుంజుకొంది. ఏకంగా ఈ సెగ్మెంట్‌లో మూడు కార్పొరేటర్లను బీజేపీ గెలుచుకుంది.
- ఇదే నియోజకవర్గ పరిధిలోని మణికొండ, నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీల్లోనూ పలువురు కౌన్సిలర్లు బీజేపీ తరఫున గెలిచారు.
- కాంగ్రెస్ కూడా నియోజకవర్గ వ్యాప్తంగా బలపడుతోంది.

కార్తీక్‌రెడ్డిని ప్రమోట్ చేస్తున్న ఎంఐఎం!

రాజేంద్రనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పాగా వేయడానికి ఎంఐఎం ఎప్పటి నుంచో ఎదురుచూస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి తమకు అనుకూల పరిస్థితులు లేకపోతే బీఆర్ఎస్ టికెట్ మంత్రి సబితారెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డికి ఇవ్వాలని పట్టుపడుతున్నట్లు సమాచారం. అలా ఇస్తే ఎంఐఎం తరఫున అభ్యర్థిని నిలపమని అంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్సీ గెలుపునకు సహకరించినందుకు మంత్రి కేటీఆర్‌ను బుధవారం రాయదుర్గంలోని టీ వర్క్స్ సముదాయంలో అసదుద్దీన్ ఒవైసీ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ టికెట్ విషయమే కార్తీక్‌రెడ్డి సమక్షంలోనే చర్చించినట్లు వార్తలు వచ్చాయి.

ఒకవేళ బీఆర్ఎస్, ఎంఐఎం మధ్య వచ్చే ఎన్నికల్లో అవగాహన ఉంటుందా? ఒకరికొకరు సహకరించుకుంటారా? సిట్టింగ్ ఎమ్మెల్యేకే టికెట్ ఇస్తారా ? ఇలా రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి.

ఎంఐఎం వార్షికోత్సవం.. భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మజ్లిస్ నాయకులు

రాజేంద్రనగర్: నిరుపేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల హక్కుల కోసం మజ్లిస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ వెల్లడించారు. మజ్లిస్ పార్టీ వార్షికోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు షేక్‌రియాజ్ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలపడి 65 సంవత్సరాలుగా మజ్లిస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు షేక్‌రియాజ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్‌లో పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసి, ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడుతున్నామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పీడీపీ చౌరస్తా అత్తాపూర్ మీదుగా దారుసలాం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ సూచించారు. నార్సింగి మున్సిపాలిటి, కోకాపేట గ్రామానికి చెందిన విమలమ్మకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 75వేల చెక్కును ఆయన గురువారం అందజేశారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు ఆర్.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌పై దాడి తగదు

- బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీరాములు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ మహాత్మాగాంధీ పార్కు వద్ద బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నవీన్‌కుమార్‌పై దాడి చేయాటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మణికొండలో ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అందులో బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు తమ తోటి కౌన్సిలర్‌పై దాడి చేయటం వారి హోదాకు తగదన్నారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే తగు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కౌన్సిలర్ నవీన్‌కుమార్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, పార్టీ కార్యకర్తలు, నాయకుల జోలికి ఎవరు వచ్చినా తీవ్ర పరిణామాలుంటాయని ఆయన హెచ్చరించారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారాన్ని అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి

మణికొండ: క్షయ వ్యాధితో ఇబ్బంది పడుతున్న రోగులకు రాష్ట్ర ప్రభుత్వం నిక్షయమిత్ర పథకంలో రూపంలో పౌష్టికాహారాన్ని అందిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి అన్నారు. గురువారం ఆమె వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కమిషనర్ వి. సత్యబాబులతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని పది మందికి పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందిస్తామన్నారు. అలాంటి వారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్‌లు అర్చన, రహీం తదితరులు పాల్గొన్నారు.

'వాఙ్మయి సంచిక' కు రచనలు పంపండి

నాంపల్లి: బోధన, పరిశోధన, ప్రచురణ, అధ్యయనాలతో పాటు తెలుగు సాహితీ సాంస్కృతిక సంపదను తరతరాలకు అందించేందుకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అధికారికంగా వాఙ్మయి పేరిట సాహిత్య వైజ్ఞానిక సంచికను వెలువరిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంచికలో ముద్రించడానికి తమ వ్యాసాలలో తెలుగు భాషా సంస్కృతి, చరిత్ర, పురావస్తు, జోతిష్య, లలిత కళల శాస్త్రాల ఆధారంగా నూతన అంశాలను జోడిస్తూ ఆధారితమైన సమగ్ర విశ్లేషణతో పరిశోధనాత్మక రచనలను పంపాలని తెలుగు రాష్ట్రాలకు చెందిన పండిత, పరిశోధకులను కోరారు. విశ్వవిద్యాలయం నియమించిన సంపాదక వర్గం రచయితల రచనలను పరిశీలించి ఉత్తమమైన వాటిని వాఙ్మయి సంచికలో ముద్రించడం జరుగుతుందని తెలిపారు. రచయితలు, పరిశోధకులు తమ రచనలను రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్. అనే చిరునామకు పంపవచ్చని లేదా స్వయంగా వచ్చి అందజేయవచ్చని సూచించారు.

'నేను ఇంటి నుంచి వెళ్తున్నా... ఇక రాను'..

రాజేంద్రనగర్: నేను ఇంటి నుంచి వెళ్తున్నా... ఇక రాను అంటూ లెటర్ రాసి ఫోన్‌కు మేసేజ్ పెట్టి ఓ మైనర్ బాలుడు పోలీసులను, కుటుంబ సభ్యులను ఉరుకులు, పరుగులు పెట్టించాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. బుద్వేల్ ప్రాంతానికి చెందిన పది సంవత్సరాల బాలుడు తన సోదరి(12)తో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గొడవ పడ్డాడు. అనంతరం ఒక పేపర్‌పై ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని రాసి టీవీ వద్ద పెట్టాడు. ఇంట్లోని సెల్‌ఫోన్‌కు అదే ఫోన్‌తో మేసేజ్ పెట్టి సైకిల్‌తో వెళ్లిపోయాడు. మెసేజ్‌ను చూసిన సోదరి తల్లిదండ్రులకు తెలిపింది. వారు స్థానిక ప్రాంతాల్లో వెతికి రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో హిమాయత్‌సాగర్ చెరువు వద్ద బాలుడు ఉన్నాడని స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాలుడిని తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఎఫ్ఓబీ నిర్మాణ పనులు పరిశీలన

రాయదుర్గం: పాదచారుల సౌకర్యార్థం రాయదుర్గం మల్కంచెరువు సమీపంలో నిర్మిస్తున్న పుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు పరిశీలించారు. గురువారం ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పనులను పరిశీలించారు. అత్యాధునిక సౌకర్యాలతో ఈ పుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్న నేపథ్యంలో ఎస్కులేటర్, లిఫ్ట్ పనులను వారు పరిశీలించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులు ఆదేశించారు.

ట్రిపుల్ ఐటీ సీఐఈలో డెమో డే

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) డెమో డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 స్టార్టప్‌లు 50కిపైగా పెట్టుబడి నిధులకు పిచ్ చేయబడ్డాయి. ఆవిష్కార్ 16వ బృందంలో డీప్‌టెక్, మెడ్‌టెక్, మీడియా టెక్ డొమైన్ నుంచి స్టార్టప్‌లు చేర్చబడ్డాయి. సీఐఈ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ సీఓఓ ప్రొఫెసర్ రమేష్ లోకనాథన్ మాట్లాడుతూ 50కి పైగా ఎక్కువ మంది పెట్టుబడిదారులు మా డెమోడేలో చేరడం, అటువంటి లోతైన సాంకేతిక ఆవిష్కరణలపై ఆసక్తి చూపడం చాలా ఆనందంగా ఉందన్నారు.

సైక్లింగ్ సంఘ సభ్యులకు సీపీఆర్ శిక్షణ



గచ్చిబౌలి: అత్యవసర సమయాల్లో పక్కన ఉన్నవారి ప్రాణాలను రక్షించడానికి బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) శిక్షణ చాలా ముఖ్యం. ప్రధానంగా సీపీఆర్ చేయడం తెలిస్తే ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వెలుపల ప్రాంతంలో సుమారు వంద మంది సైక్లింగ్ సంఘం సభ్యులకు ఎస్ఎల్‌జీ ఆస్పత్రికి చెందిన ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ టి అప్పిరెడి ఆధ్వర్యంలో అదే విభాగానికి చెందిన డాక్టర్ హేమసింధు, డాక్టర్ విఠల్‌లు సభ్యులతో బొమ్మలపై సీపీఆర్ ప్రాక్టీస్ చేయించారు. ప్రతి ఒక్కరూ స్వయంగా చేయడం ద్వారా ఎక్కడ ఎంతసేపు కంప్రెషన్లు ఇవ్వాలో తెలుసుకున్నారు. ఇది తోటి వారి ప్రాణాలను కాపాడేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పురుగుల అన్నం.. ఫిర్యాదు చేసిన విద్యార్థులు

రాజేంద్రనగర్: మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయంటూ విద్యార్థులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురాగా వారు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెలుగు చూసింది. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో 3,4 రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయి. దీనిపై ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధ్యాయులు బుధవారం ఆ అన్నాన్ని రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్‌ను కార్యాలయంలో కలిసి చూపించారు. దీంతో ఆయన వెంటనే పౌరసరఫరాల అధికారులను రప్పించి హెచ్చరించినట్లు తెలుస్తుంది. ఈ విషయమై తహసీల్దార్ వివరణ కోసం సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

తహసీల్దార్ వివరణ...

మధ్యాహ్న భోజనంలో పురుగుల విషయమై రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా తన వద్దకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వచ్చిన మాట వాస్తవమేనని వెల్లడించారు. కానీ అన్నంలో పురుగుల విషయం కాదని బియ్యంగా సరిగ్గా లేవని తెలపడంతో తాను పౌర సరఫరాల అధికారులకు వెంటనే సమాచారం అందించి (ఏఎస్‌వో) పాఠశాలలో బియ్యాన్ని తరలించినట్లు తెలిపారు. తిరిగి కొత్త బియ్యాన్ని పంపించానన్నారు.

ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించాలి



ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

నాంపల్లి: ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం గేట్లు ఎక్కి లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేసిన ఏబీవీపీ కార్యకర్తలను బేగంబజార్ పోలీసులు అరెస్టు చేసి ఆందోళనకారులను అక్కడి నుంచి తరలించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కమల్ సురేష్ ప్రసంగించారు. ఇంటర్ బోర్డుకు శాశ్వత కమిషనర్‌ను నియమించాలని, అనుమతులు లేని కళాశాలలను రద్దు చేయాలని కోరారు. శ్రీ చైతన్య కార్పొరేట్ జూనియర్ కళాశాలలో వరుస ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర నాయకులు పృథ్వీతేజ, జీవన్, రాజు, మహస్త్రష్, శ్యామ్, జిల్లా కన్వీనర్లు శ్రావణ్, ప్రతిక్, సిరివెన్నెల కల్యాణి, దీపిక, నదీమ్, చందు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు ఎదుట ఆమ్ ఆద్మీ నేతల ఆందోళన ..

శ్రీ చైతన్య కళాశాల నార్సింగ్ శాఖలో ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి సాత్విక్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, శోభన్ బాబు భూక్యా హాజరై ప్రసంగించారు. కార్పొరేట్ కాలేజీల ఆగడాలకు అమాయకపు విద్యార్థులు బలవుతున్నారని ఆరోపించారు. అనంతరం ఆప్ నేతలు ఇంటర్ బోర్డు కార్యాలయం గేటు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో బేగం బజార్ పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి అక్కడ నుంచి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు బర్క కృష్ణయాదవ్, మొహమ్మద్ మాజిద్, పప్పుల సుధాకర్, పరీక్ష రావణ, సయ్యద్ గఫార్ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో.. బాలుడిని చితకబాదారు

రాజేంద్రనగర్: గంజాయి మత్తులో కొందరు మైనర్లు డబ్బు కోసం మరో మైనర్ బాలుడిని చిత్రహింసలకు గురి చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దానమ్మ జోపిడి ప్రాంతంలో ఓ వ్యక్తి కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. మైనర్ అయిన పెద్ద కుమారుడు పాఠశాలకు వెళ్లి వచ్చిన అనంతరం దుకాణంలో కూర్చుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన ఐదుమంది మైనర్ బాలురు గంజాయికి అలవాటుపడి తిరుగుతున్నారు. బుధవారం మధ్యాహ్నం దుకాణంలో ఉన్న మైనర్ బాలుడిని బయటకు రమ్మని పిలిచి పక్కనే ఉన్న గుట్టల్లోకి తీసుకువెళ్లి తాము అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వాలంటూ చితకబాదారు. బట్టలు ఊడదీసి అరగంట పాటు వేధించారు. దీంతో బాలుడికి గాయాలయ్యాయి.వారి నుంచి తప్పించుకుని ఇంటికి వచ్చి విషయాన్ని తల్లికి తెలిపాడు. తల్లిదండ్రులు గురువారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనకు పాల్పడిన వారంతా మైనర్లు అని పోలీసులు వెల్లడించారు.

త్వరలో రోడ్డు పనులు ప్రారంభం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో త్వరలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రోహిణి అన్నారు. గురువారం ఆమె గోల్కొండ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి మెడికల్ సూరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లాతో కలిసి ఆస్పత్రిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి ప్రాంగణంలో జరగనున్న రోడ్డు పనులపై చర్చించారు. అయితే గోల్కొండలో రోడ్ల విస్తరణ పథకంలో భాగంగా జీహెచ్ఎంసీ వారు ఆస్పత్రికి నోటీసులు ఇచ్చారని ఈ సందర్భంగా డాక్టర్ మజహర్ ఉల్లా ఆమె దృష్టికి తెచ్చారు. ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు ఆస్పత్రిలో త్వరలోనే కొత్త బ్లాక్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, దీనికి గాను రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని ఉల్లా వివరించారు.

రైతుబజార్‌లో అక్రమంగా పార్కింగ్ వసూళ్లు

గోల్కొండ: మెహిదీపట్నం రైతుబజార్‌లో వాహనాల పార్కింగ్ దందా అక్రమంగా కొనసాగుతుందని బీజేపీ గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా నాయకులు రావుల మాణిక్ ప్రభు, గోదాలక్ష్మీకాంత్ యాదవ్ అన్నారు. రైతుబజార్‌లో పార్కు చేసిన వాహనాలకు డబ్బులు వసూలు చేయరాదని స్పష్టంగా ఉన్నా కూడా ఇక్కడ వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై తాను రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్‌తో పాటు సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలిపారు.

దొంగతనం కేసులో రూ.15 లక్షలు స్వాధీనం

రాజేంద్రనగర్: వసూలు చేసిన నగదును తీసుకుని ఉడాయించిన కేసులో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రూ.15 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు రాజేంద్రనగర్‌జోన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించాడు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురానాపూల్ ప్రాంతానికి చెందిన కృష్ణకుమార్‌గుప్తా డబ్ల్యూపీవీసీ డోర్‌లను తయారు చేస్తుంటాడు. ఇతడి వద్ద బిహార్‌కు చెందిన షానవాజ్ మూడు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. షానవాజ్ ప్రతి రోజు ఆయా దుకాణాల నుంచి డబ్బు తీసుకుని యజమానికి అప్పగిస్తుంటాడు. గత నెల 17వ తేదీన కాటేదాన్‌లోని రితేష్‌సింగ్ నుంచి రూ.25 లక్షల రూపాయలు తీసుకురావాలని కృష్ణకుమార్ షానవాజ్‌కు తెలిపాడు. అతను డబ్బు తీసుకుని ఆ విషయాన్ని మేనేజర్ మధుకు తెలిపి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. సాయంత్రం 6.05 గంటల ప్రాంతంలో తాను ఉంటున్న గదికి వెళ్లి అందులో 15 లక్షలు భద్రపరిచి వాహనాన్ని అక్కడే పార్కు చేసి పది లక్షలతో ఉడాయించాడు. రాత్రి వరకు కార్యాలయానికి రాకపోవడంతో కృష్ణకుమార్ షానవాజ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో అతని కోసం వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో రితేష్ వద్దకు వచ్చి ప్రశ్నించగా డబ్బులు ఇచ్చానని తెలపడంతో అదే రోజు రాత్రి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. షానవాజ్ అద్దెకు ఉంటున్న ఇల్లు ఎవరికి తెలియకపోవడంతో పోలీసులు ఇబ్బందులు పడ్డారు. కాగా మేనేజర్ మధుకు గతంలో షానవాజ్ తాను ఉంటున్న ప్రాంతం వివరాలు తెలపడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు గురువారం ఆ ఇంటిని సోదా చేయగా 15 లక్షలు దొరికాయి. నిందితుడి కోసం బిహార్‌కు ప్రత్యేక బృందం వెళ్లిందని డీసీపీ వెల్లడించారు.

హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయను కొనసాగించాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు వినతి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయను కొనసాగించేలా చూడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయ పరిరక్షణ సమితి ప్రతినిధులు, తల్లిదండ్రులు ఆయనను గురువారం ఆయనను నగరంలో కలిశారు. కేంద్రీయ విద్యాలయ గురించి ఆయనకు వివరించారు. ప్రస్తుతం ఈ స్కూల్‌ను మూసి వేయాలని హెచ్‌సీయూ నిర్ణయించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడతారని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బండిసంజయ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రవికుమార్‌యాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు